మనోహరి మహాజ్వాల ప్రపంచ ప్రసిద్ధి చెందిన గొప్ప నర్తకి. అన్ని రకాలైన భారతీయ, ప్రాచ్య, పాశ్చాత్య నృత్యాలను అభ్యాసం చేసింది. ప్రపంచంలో ఏ దేశంలో నైనా సరే, ఆమె నృత్యం చేస్తున్నంత సేపూ ప్రజలు గ్రుడ్లప్పగించి



# సాత్త్విక సిద్ధి

విశ్వనాథ పావనిశాస్త్రి

నిశ్చేష్టులై చూస్తూ ఉండవలసిందే!

అధునాతన మైన "బ్రేక్‌డాన్స్", "ఫ్లాష్‌డాన్స్" వంటి వాటిల్లో కళ్ళు మిరుమిట్లు గొలిపే, అత్యద్భుత మైన శరిర విన్యాసాలుంటాయి. అయితే "తెరెకిట తకతెరె, కిటతక తెరెకిట, తళాంగు తదిగిణ తకతోం, తెరెకిటతోం" వంటి అమిత వేగవంతమైన గతులకి అనుగుణంగా – పాదాలు నేలనే అంటి పెట్టుకుని ఉంటూ, ప్రతి అక్షరంతో వేగంగా కదులుతూ గంటల కొలదీ నృత్యం చేయగల భారతీయ నృత్య కళాకారులకి అదేమంత పెద్ద కష్టం కాదని రుజావు చేస్తూ, భారతీయ నృత్యానికి పాశ్చాత్య దేశాలలో గొప్ప ప్రచారం తెచ్చిన వనితా మణులలో కిరీట మణి ఆమె!

అటువంటి ఆమె చిరకాలానికి తన స్వస్థలంలో దేవీ నవరాత్రాలకి నృత్యం చేయడానికి వచ్చింది. ఆ రోజున ప్రపంచం నలుమూలల నుండి, ఆమెకు ఎన్నో ఆహ్వానాలున్నాయి కొన్ని లక్షల కనక వర్షం కురుస్తుంది. అయినా ఆమె వాటి నన్నిటినీ తిరస్కరించింది. తన ఆరాధ్య దైవం దుర్గాదేవి. ఆ దేవికి తన నాట్య విద్య నర్పణం చేయాలి. అదే ఆమె ధ్యేయం.

ఆ రోజు విజయ దశమి. ఉదయం ఆరు గంటలకి నృత్యం ప్రారంభించింది ఆమె. మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటుతోంది. జనం ఒడ్ను విరిగి పోతున్నారు. మృదంగ విద్వాంసుడు నురుగులు కక్కు తున్నాడు. నట్టువ పట్టిన గురువు గొంతెండి పోతోంది. ఇతర వాయిద్యాల వారి సంగతి చెప్పనక్కర లేదు. ఆమె కాలి గజ్జెల ఘలంఘలారావాలు వర్షాకాల మహాప్రవాహ మల్లే సాగిపోసాగాయి మహిషాసుర మర్దనిని చూసికాబోలు, శరత్కాల సూర్యుడు కూడా ఆ రోజు నిప్పులు కక్కుతున్నాడు కన్నులు ఎన్ని భావాలు మారుతున్నా, విన్యాసాలు ఎన్ని దిక్కులకు పరిగెడుతున్నా మనోహరి మహాజ్వాల చూపులు మాత్రం కరాళ జిహ్వ అయిన అమ్మవారి మీదనే ఉన్నాయి అమ్మవారు మాత్రం గ్రుడ్లప్పగించి చూస్తోంది.

అంతలో దూరాన్నించి బ్రహ్మాండ మైన మేళతాళాలతో సూర్య కోటి ప్రభ రాసాగింది. అందరూ తలలు అటు తిప్పారు అమ్మవారి దగ్గరికి ఊరేగింపుగా వచ్చే ప్రభలలో, ఆ చుట్టు పట్ల సూర్యకోటి ప్రభ చాలా ప్రసిద్ధమైంది. కోటి అనే ఒక కూరగాయల వ్యాపారస్తుడు, సూర్య అనే అతని అక్కగారు ప్రతి యేటా నిర్వహిస్తారు ఆ ప్రభని. మేళతాళాలతో, భక్త బృందంతో, అనుచరులతో కోటి క్రింద నడుస్తున్నాడు. ప్రభ మీద సర్వాలంకార భూషితయై, దుర్గ వేషంలో సూర్య నిలబడి ఉంది.

సూర్య అవివాహిత. ఆజాను బాహువు. కిరీట ధారిణి అయిన ఆమె, సామాన్యమైన ఎత్తున్న యిద్దరు మగవాళ్ళు ఒకడి భుజాల మీద యింకొకడు నిలబడితే ఎంత ఎత్తుంటారో అంత ఎత్తుంది. నిగనిగలాడే రంగు రంగుల పుష్పాదులతో ఆమె శరీరకాంతి బంగార మల్లే ధగా ధగలాడి పోతోంది. మృగరాజ మధ్యము, నగరాజ వక్షము, ఖగరాజ నాసము, అగరాజ కేశము, ఋషరాజ నేత్రము! ఓహ్! అనేక సంవత్సరాలు తదేక దీక్షగా అభ్యాసం చేసినా అలవడని ఒక మహా ప్రసన్నతా భావం, ఆమె కళ్ళలో బంగారు గూడు కట్టుకుని నివాస ముండి పోయింది. ఆమెను చూస్తున్న ప్రజలకు అమ్మవారు ఆమెను ఆవహించిందా అనిపించింది.

సూర్యకోటి ప్రభ దగ్గిరగా వచ్చింది. మనోహరి మహాజ్వాల అప్రయత్నంగా అటు చూసింది. ఉత్తర క్షణంలో వేదిక మీద విరుచుకు పడి పోయింది

అందరూ కంగారు పడసాగారు సూర్య వేదిక మిదకి వచ్చింది ,గండ భేరుండ పక్షి పాల పిట్టని లేవదీసి నట్టుగా మనోహరిని లేపి నిలబెట్టింది. వందమంది అప్సరసలు పైట చెరగులు విసిరినట్టుగా అడుగులు వేయసాగింది సూర్య. మృదంగం, నట్టువ, ప్రక్క వాయిద్యాలు స్తంభించి పోయాయి. సూర్య ముఖంలోని ప్రసన్నతా భావం చెక్కు చెదరలేదు.

మనోహరి మహాజ్వాల తిరిగి నృత్యం ప్రారంభించింది. ఇప్పుడామె నృత్యం తీరే మారి పోయింది. మృదంగ విద్వాంసుడు గుండెనిండా గాలి పీల్చుకున్నాడు. నట్టువ గురువు మంచినీళ్ళు తాగి పునఃప్రారంభించాడు. ఇతర వాయిద్యాలు కిలకిలారావాలు చేయసాగాయి ఒడ్ను విరిగిపోయి తొక్కు కుంటున్న జనం ప్రశాంతంగా చూడ సాగారు. గ్రుడ్లప్ప గించి చూస్తున్న అమ్మవారు, అర్ధ నిమీలిత నేత్ర యైంది.

సూర్య తన ఆభరణాలన్నీ అమ్మవారి పాదాల ముందు అర్పించి, వట్టి చీర రవిక గాజులతో నిలబడి ఉంది. అప్పటి దాకా ఆమె ముఖంలో రాజ్యమేలిన ఒక దివ్యభావం అదృశ్యమై, సామాన్య మానవ స్త్రీ లాగానే ఉంది ఆమె! కాని ఆమె విగ్రహం! అతి పౌరుషం!!

మనోహరి మహాజ్వాల తన విద్య అమ్మవారికి అర్పించడం మరిచిపోయి, అమ్మవారి దగ్గర నుండి మరికొంత తీసుకుంది □